



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మన్సూర్ రహ్మాన్

కదం తొక్కిన.. అంగన్‌వాడీలు



వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

- ధర్నా చౌక్ నుండి కలెక్టరేట్‌కు భారీ ప్రదర్శన
- ఉన్నతాధికారుల దృష్టికి తెస్తా : ఐసిడిఎస్ పిడి ఉమా మహేశ్వరి
- మరో పోరాటం : సిఐటియు
- మహా ధర్నాలో అంగన్‌వాడీల ఆగ్రహం



ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్‌కు ప్రదర్శన చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ /కర్నూల్ అగ్రికల్చర్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన 36 గంటల మహాధర్నాలో అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధర్నా చౌక్ నుండి కలెక్టరేట్ వరకు వందలాదిమంది అంగన్వాడీలు ప్రదర్శనగా వెళ్లారు. పాలకులు స్పందించాలనే నినాదాలతో హోరెత్తించారు. కలెక్టరేట్ దిగ్బంధనం చేపడుతుండడంతో అక్కడికి వెంటనే ఐసిడిఎస్ పిడి ఉమామహేశ్వరి చేరుకొని యూనియన్ ప్రతినిధుల నుండి వినతిపత్రాన్ని స్వీకరించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ , ఎండి.అంజిబాబు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ తరహాలో అంగన్వాడీలకు వేతనాల పెంపు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ చెల్లింపుతో పాటు విధి నిర్వహణలో చనిపోయిన అంగన్వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. పెండింగులో ఉన్న కూరగాయల బిల్లులను చెల్లించాలని పిడి దృష్టికి తెచ్చారు. ఈ సమస్యలపై స్పందించిన ఐసిడిఎస్ పిడి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఉన్న అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంగన్‌వాడీలపై ఎలాంటి వేధింపులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న కూరగాయల బిల్లుల చెల్లిస్తామనిహామీ ఇచ్చారు. ఈ మహాధర్నాకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, ఆశా వర్కర్స్ యూనియన్ , ఆర్‌పిల సంఘం, ప్రజానాట్యమండలి ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. అంతకుముందు జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి రాధాకృష్ణ ఎండి. అంజిబాబు, పి.నిర్మల మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. ప్రస్తుతం 36 గంటల ధర్నా ట్రైలర్ మాత్రమేనని జగన్ కనుక మన సమస్యలు పరిష్కారం చూపకపోతే అంగన్వాడీల బలం ఏంటో చూపిస్తామన్నారు. రాబోవు కాలంలో నిరవధిక దీక్షలకు సమ్మెలకు సిద్ధంగా ఉండాలన్నారు. 30 సంవత్సరాలుగా పనిచేసే రిటైర్మెంట్ అవుతున్న సందర్భంలో రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వకుండా అంగన్వాడీలను రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ వచ్చేంతవరకు ఆందోళన కొనసాగించాల్సిందేనన్నారు. ఎప్పటికైనా పాలకులు స్పందించకపోతే మరో పోరాటం చేపట్టేందుకు సంసిద్ధం కావాలని కోరారు. ఎస్ఎఫ్ఐనాయకులు సాయి, అమర్ కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు మాట్లాడారు. పోరాటానికి ప్రజా సంఘాలు ఎప్పుడూ అండగా ఉంటాయన్నారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి రమీజాబీ, ఆర్పీల సంఘం నాయకులు ఉమాదేవి, షబానా మద్దతును తెలిపారు. ప్రజానాట్యమండలి కళాకారులు గేయాలపన ద్వారా అంగన్వాడీ ఉద్యమానికి సంఘీభావాన్ని తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, ఎం.గోపాల్, ప్రభాకర్ , సిఐటియు నగర నాయకులు సాయిబాబా, నరసింహులు, మహమ్మద్ రఫీ, అబ్దుల్లా రామకృష్ణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు రుక్మిణమ్మ, వెంకటమ్మ, గోవర్ధనమ్మ, కాంతమ్మ, జ్యోతి, పద్మా ,అరుణ, విజయ కుమారి, బాలదుర్గమ్మ, విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

తల్లులు ధర్నాలో పిల్లలు తండ్రి చెంత

అంగన్వాడీల 36 గంటల మహాధర్నా విజయవంతం అయింది. జిల్లా నలుమూలల నుండి అంగన్వాడీలు వచ్చారు. చాలా మంది తల్లులు పిల్లలను పట్టుకోవడానికి ఎవరు లేక తమ భర్తల చెంత పిల్లలను వదిలి మహధర్నా ను విజయవంతం చేశారు. లద్దగిరి 5వ అంగన్వాడీ సెంటర్‌కు చెయిందిన అంగన్వాడీ ఉద్యోగి బాబును తండ్రి దగ్గర వదిలి ఆమె ధర్నాలో పాల్గొన్నారు. రాష్ట్రప్రభుత్వం చేస్తున్న మోసపురితమైన హామీలు నశించాలని అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను తక్షణమే తీర్చాలని గొంతెత్తి నినదించారు. దాదాపు 36 గంటల పాటు ధర్నా సెంటర్‌లోనే ఉండి విజయవంతంగా 36 గంటల మహాధర్నాను విజయవంతం చేశారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం చర్చలకు పిలవాలని కోరారు.

సిపిఎం మహా పాదయాత్రకు సంపూర్ణ మద్దతు

- రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు
- జిల్లా వెనుకబాటుకు పాలకుల నిర్లక్ష్యమే కారణం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధి, సాగునీటి, తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, యువతకు ఉపాధి కల్పించాలని కోరుతూ సిపిఎం చేపట్టిన జీపు జాతలకు, మహాపాదయాత్రకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తామని పలు రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు.

మంగళవారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మిక కర్షక భవన్‌లో కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధిపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్.రసూల్, తెలుగుదేశం నాయకులు జగదీష్, బిసి సంఘం నాయకులు శేషపని, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇ.పుల్లారెడ్డి మాట్లాడారు. జిల్లా వెనకబాటుతనం పాలకుల నిర్లక్ష్యమేనని విమర్శించారు.

పేరుకే యూనివర్సిటీలు

- మన్సూర్ రహ్మన్ ఆర్థికవేత్త, విశ్రాంత అర్థశాస్త్ర ప్రొఫెసర్

కర్నూలు జిల్లాలోని 26 మండలాల్లో 6 మండలాలు మినహా మిగతా మండలాలన్నీ వ్యవసాయపరంగా పారిశ్రామికంగా పర్యాటక విద్యా వైద్యంలో వెనుకబడి ఉన్నాయని లెక్కలతో సహా వివరించారు. కెసి కెనాల్ మన జిల్లా నుండి పోతున్నప్పటికీ నంద్యాల జిల్లాకు ప్రయోజనం చేకూరుస్తుంది. కర్నూలు జిల్లాలో పేరుకు మాత్రం క్లస్టర్ యూనివర్సిటీ, రాయలసీమ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీలు ఉన్నప్పటికీ వాటికి నిధులు కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది. భవనాలు, తగినంత సిబ్బంది నియామకాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

టిడిపి సహకరిస్తుంది

- టిడిపి నాయకులు జగదీష్



జిల్లా సమగ్ర అభివృద్ధికి టిడిపి అన్ని విధాల సహకరిస్తుంది. సిపిఎం పార్టీ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ఏ కార్యక్రమాలు చేసినా టిడిపి ముందుండి సహకరిస్తుందని. జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి చూపాలి. బడ్జెట్‌లో విద్య, వైద్యానికి నిధులు పెంచాలి.

నైసర్గిక స్వరూపాన్ని బట్టి జిల్లాల విభజన చేపట్టాలి

- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్.రసూల్



జిల్లా విడిపోయిన తర్వాత ఎలాంటి ఆదాయం మార్గం లేదు. ప్రాజెక్టులు పరిశ్రమలు మన జిల్లాకు ఏమీ లేవు. ఫారెస్ట్‌ను కూడా కర్నూలు జిల్లాకు కేటాయించాలి. మంత్రాలయం నుండి కర్నూలుకు రైల్వే లైను ఏర్పాటు చేయాలి. జొన్నగిరి ప్రాంతంలో వజ్రాలు, బంగారు గనులు ఉన్నాయి. వాటిని అభివద్ధి చేయాలి. ఆధ్యాత్మిక కేంద్రాలైన ఎల్లార్తి దర్గా, ఆదోని ఎల్లమ్మ కొండ, కేతవరం శిలా శాసనాలు లాంటి వాటిని అభివృద్ధి చేయాలి. టూరిజం కోసం సుంకేసుల వద్ద బోటింగ్, ఫిషింగ్ స్పాట్ లాంటి వాటితో పాటు విజయ వనం, నగరవనం, దూపాడువద్ద నగరవనం, ఆలూరు వద్ద జింకల పార్కులను ఏర్పాటు చేయాలి. పశ్చిమ ప్రాంతం ప్రజలు వలసలు పోకుండా టమాటో జ్యూస్, సాస్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలి.

సమస్యలు ప్రభుత్వం దృష్టికి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ యూనియన్ నాయకులు శేషఫణి



వెనుకబడిన ప్రాంతాల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. ప్రశ్నించే తత్వం ఉన్నప్పుడే రాజకీయ నాయకుల దష్టి సారిస్తారు. నైసర్గిక పరిస్థితులకు అనుగుణంగా విభజన జరగలేదు. ఎన్నికల ప్రణాళికల్లో కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించేలా నిధులు కేటాయిస్తామని ఉండాలి. ఇతర రాష్ట్రాలకు రోడ్డు, రవాణా, రైలు మార్గాలను కలిపి అన్ని ప్రాంతాలకు చేరే విధంగా చేయాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయం అభివృద్ధి చెందితేనే..

- ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మునెప్ప



పాలకులు వెనుకబడిన ప్రాంతాలపై దృష్టి సారించకపోవడం వల్లనే విద్య, వ్యవసాయం, వైద్య పరంగా వెనుకబడి ఉంది. వ్యవసాయం అభివృద్ధి చెందితేనే జిల్లా అభివృద్ధి చెందుతుంది.

సాంస్కృతిక రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి



- ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఎంపి బసవరాజు

కర్నూలు జిల్లాలో సాంస్కృతిక రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం విద్య, వైద్యం, రవాణా, ప్రాజెక్టుల అభివృద్ధి కోసం రాజకీయ నాయకులను నిలదీయాలి. అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే అభివృద్ధి సాధ్యం.

అన్ని పార్టీలు ఒకే అజెండాతో ముందుకు వెళ్లాలి

- కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు.



అన్ని రాజకీయ పార్టీలు ఒకే అజెండాగా ముందుకు వెళ్లాలన్నారు. అంటరానితనం, నిరక్షరాస్యత ఉండడం వల్లనే చాలా గ్రామాల్లో దళితులు వెనుకబడి ఉన్నారు. రాజ్యాంగంలో రూపొందించిన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. రౌండ్ టేబుల్ సమావేశంలో డిబిఎస్‌యు రాష్ట్ర నాయకులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఎఐవైఎఫ్ నాయకులు శ్రీనివాసులు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇ. పుల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కెవి నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, సిఐటియు సీనియర్ నాయకులు రామాంజనేయులు, సిపిఎం ఓల్డ్ సిటీ, న్యూ సిటీ కార్యదర్శులు రాజశేఖర్, రాముడు తదితరులు ప్రసంగించారు.

పత్తిపై తెగుళ్ల కత్తి

- సాగైందీ కొంతే
- అందులోనూ ఎర్ర, గులాబీ తెగుళ్లు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పత్తి పంటపై తెగుళ్ల కత్తి పడింది. సాధారణ సాగులో నామమాత్రంగా సాగు చేశారు. అందులోనూ చాలా వరకూ పంటకు ఎర్ర తెగులు, గులాబీ తెగులు సోకడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

కర్నూలు జిల్లాలో పత్తి పంటకు ఈ ఏడాది అనుకూల పరిస్థితులు కనిపించడం లేదు. వర్షాభావం కారణంగా సాధారణ సాగులో చాలా కొంత మాత్రమే సాగైంది. ప్రతి ఏడాది జిల్లాలో అత్యధికంగా పత్తి పంటను సాగు చేస్తారు. అలాంటి పత్తి పంట సాగు ఈ ఏడాది తగ్గేటట్టు కనిపిస్తోంది. ఒక వైపు నకిలీ విత్తనాల వల్ల ప్రతి ఏడు రైతులు నష్టాలు మూట కట్టుకుంటుండగా మరో వైపు ఈ ఏడాది లోటు వర్షపాతం పత్తి పంట సాగుపై ప్రభావం చూపుతున్నాయి. తొలకరి వర్షాలు ప్రారంభమై దాదాపు నెల కావస్తున్నా ఇప్పటి వరకూ ఖరీఫ్ సాగుకు అడుగులు ముందుకు పడటం లేదు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ సాధారణ సాగులో కేవలం 8.2 శాతం మాత్రమే విత్తనాలు వేశారు. జిల్లాలో మొత్తం సాధారణ సాగు 10,53,900 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 86,770 ఎకరాల్లో మాత్రమే రైతులు విత్తనాలు వేశారు. జూన్ నెలలో 77.7 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 46.9 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. వర్షాలు ఆశించిన రీతిలో పడకపోవడంతో విత్తనం విత్తేందుకు రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంటగా ఉండే పత్తి సాధారణ సాగు 6,25,067.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 65,155 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. 10.4 శాతం పంట మాత్రమే సాగైంది. వర్షం లేకపోవడం వల్ల ఇప్పటికే పలు ప్రాంతాల్లో పత్తి చెట్లు ఎండిపోతున్నాయి. దానికి తోడు ఎర్ర తెగులు, గులాబీ తెగులు పంటపై కత్తిలా మారాయి. సాగు అయిన 10 శాతం పంటలోనూ సగం వరకూ పంట ఎర్ర తెగులు, గులాబీ తెగులు బారిన పడింది. సి.బెళగల్ మండలంలో 8,204 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వాటిలో వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా 2300 ఎకరాల్లో పంటను రైతులు దున్నేశారు. యనకండ్ల గ్రామంలో పంటను పశువులకు వదిలేశారు. గోనేగండ్ల మండలంలో పత్తి సాధారణ సాగు 4,250 ఎకరాలు కాగా 3,380 ఎకరాల్లో సాగు చేశారు. వాటిలో 180 ఎకరాల వరకూ ఎర్రతెగులు బారిన పడింది. నందవరం మండలంలోనూ పత్తి పంటకు ఎర్ర తెగులు సోకింది. గూడూరు మండలంలో పత్తి పంటకు గులాబీ తెగులు సోకింది. ఇలా పత్తి పంటకు జిల్లాకు అనుకూల పరిస్థితులు కనిపించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పత్తి పంటపై ప్రకృతి కరుణించడం లేదు. వర్షం జాడ అసలు కనిపించడం లేదు. సాధారణ సాగులో నామమాత్రంగా జిల్లాలో పత్తి పంటను సాగు చేశారు. అందులోనూ పంట ఎర్ర తెగులు, గులాబీ తెగులు బారిన పడింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దానికి తోడు జిల్లాలోని 7 మండలాల్లో గతేడాది పంటకు సంబంధించి నష్టపోయిన పంటకు బీమా పరిహారం అందలేదు. నష్టపోయిన పత్తి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి.


- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి.



పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై తుగ్గలిలో ధర్నా

ప్రజాశక్తి-తుగ్గలి

సచివాలయంలో పనిచేస్తున్న వాలంటీర్లను జనసేన రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మంగళవారం తుగ్గలిలో వాలంటీర్లు ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి ధర్నా నిర్వహించారు. వైసిపి మండల కమిటీ అధ్యక్షులు జిట్టా నగేష్ యాదవ్, వైసిపి వింగ్ జిల్లా కార్యదర్శి తుగ్గలి మోహన్ రెడ్డి, సచివాలయం మండల కన్వీనర్ హనుమంతు మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ వాలింటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సచివాలయంలోని వివిధ గ్రామములో సేవలు అందిస్తున్న వారిపై నీఛాతి నీచంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. ఒక రాజకీయ పార్టీ అధినేతగా ఉన్న పవన్ కళ్యాణ్ ఇలాంటి మాటలు మాట్లాడం అవివేకమని అన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న వాలంటీర్లపై అలా ప్రవర్తించడం సరి కాదన్నారు. రాష్ట్రంలో ఒక ఎమ్మెల్యే సీటు కూడా గెలవలేని పవన్ కళ్యాణ్ ఏ ఉద్దేశంతో రాజకీయం చేస్తారో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్ వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం తుగ్గలి పోలీస్ స్టేషన్లో పవన్ కళ్యాణ్ పై ఫిర్యాదు చేశారు. రామచంద్రరెడ్డి, రాతన మోహన్ రెడ్డి, జడ్పిటిసి పులికొండ నాయక్, టిఎండి హుస్సేన్, వైస్ ఎంపిపిలు మల్లికార్జున రెడ్డి, ఎర్రనాగప్ప, మాజీ జెడ్పిటిసి జగన్నాథరెడ్డి, నారాయణ నాయక్, కో ఆప్షన్ సభ్యులు చాంద్‌బాష, తుగ్గలి చంద్రశేఖరరెడ్డి, పాల్గొన్నారు.



పవన్ అనుచిత వాఖ్యలు సరికాదు

సి బెళగల్ ఎంపిపి బొంతల మునెప్ప

ప్రజాశక్తి-సి బెళగల్

ప్రజలకు ఇంటింటా శ్రమించి సేవలందిస్తున్న వాలంటీర్లపై జనసేన వ్యవస్థాపకులు పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సహించారనిదని క్షమాపణ చెప్పే వరకు ఉద్యమించాలని ఎంపిపి బొంతల మునెప్ప పేర్కొన్నారు. మంగళవారం బురాన్ దొడ్డి, బ్రాహ్మణ దొడ్డి గ్రామాల్లో తహసీల్దార్ శేషఫణి, ఎంపిడిఒ రాముడులు జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. ఇక్కడే ఎంపిపి పాల్గొని రాజకీయ అనుభవం లేని వ్యక్తి పవన్ అని, వాలంటీర్ల సేవలు ఎనలేనివని, క్షమాపణ చెప్పాలని లేదంటే కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వైసిపి చేస్తున్న అభివద్ధిపై లేనిపోని ఆరోపణలు చేస్తుండటం సిగ్గుచేటని పేర్కొన్నారు.

32వ వార్డు సమస్యలను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగర పాలక సంస్థ పరిధి 32వ వార్డులోనీ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుధాకరప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం 81, 82 వ వార్డు సచివాలయాలలో అడ్మిన్‌లకు సిపిఎం ఆధ్వర్యంలో వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప ఎం. దావీదు, ఎస్. శారదమ్మ, బి చిన్న, జె.శ్రీనివాసులు, కష్ణ మాట్లాడుతూ ముజఫర్ నగర్ లోని మురుగు కాలువల నీరు మొత్తం హంద్రీ నదిలో కలవడం వల్ల అక్కడ నీరు కలుషితమై గుంతలలో నీరు నిలువ ఉంటుంది. దీంతో దోమలు,పందుల బెడద దుర్వాసన ఎక్కువైపోయి ప్రజలు అనారోగ్యాల పాలు అవుతున్నారని తెలిపారు. హంద్రీ వెంట కాలువ నిర్మించాలని డిమాండ్ చేశారు. గంగావతినగర్‌లో మహిళలు మరుగుదొడ్డి లేక ఉన్న మరుగుదొడ్డి పనికిరాక మహిళలు ఆరు బయటనే వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్డిని రిపేరు చేయించి మహిళలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. గోవర్ధన్ నగర్‌లో రైతు బజారు నిర్మాణం కోసం పనులు ప్రారంభించి మధ్యలో ఆపివేయడం వల్ల రైతు బజార్ పూర్తికాక రైతులు వ్యాపారస్తులు ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి కూరగాయలు సరుకులు తెచ్చుకునే పరిస్థితి ఉందని తెలిపారు. వెంటనే రైతు బజార్ పనులు పూర్తిచేసి ప్రజలకు రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు సుధాకరప్ప తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : హఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నదే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం కర్నూలు నగరంలోని 2, 7,18, 49 వార్డుల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల లబ్ధిని అందజేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం అలాంటిది ఇబ్బందులు లేకుండా దరఖాస్తు దారుని ఇంటి వద్దకే స్వయంగా పత్రాలను తీసుకొచ్చే ప్రక్రియను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 12 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ప్రతినిత్యం ప్రజలకు అండగా ఉంటూ ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకు చేర్చే వాలంటీర్లను గురించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తప్పుడు వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. వాలంటీర్లను అవమానించడమే అవుతుందన్నారు. మహిళలను అక్రమంగా తరలిస్తున్నారని చెబుతూ విమర్శలు చేయడం దారుణమన్నారు. ఇది కేవలం ప్రభుత్వం పై అక్కసుతో మాట్లాడుతున్నారన్నారు. వాలంటీర్లకు పవన్ కళ్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జుబేర్, కృష్ణ కాంత్, యూనిస్, వార్డు నాయకులు టిఎండి ఫైరోస్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కల్లూరులో టిడిపి సంఘీభావ పాదయాత్ర

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 2000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని పాణ్యం నియోజకవర్గ కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామం నుంచి సంఘీభావ పాదయాత్ర మంగళవారం టిడిపి నాయకులు కార్యకర్తలు చేపట్టారు. టిడిపి పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘీభావ పాదయాత్ర చిన్నటేకూరు నుంచి పెద్దటేకూరు గ్రామం వరకు కొనసాగింది. గౌరు చరిత మాట్లాడుతూ నార లోకేష్ యువగళం పాదయాత్ర 2000 కిలో మీటర్లు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. పెద్దటేకూరులో టిడిపి శ్రేణులతో కలిసి గౌరుచరితరెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కల్లూరు మండల అధ్యక్షుడు డి రామాంజనేయులు, తడకనపల్లె సర్పంచి సహేరాబి, పెద్దటేకూరు సర్పంచి బోయ పద్మావతమ్మ, పర్ల ఎంపిటిసి మేకల శేషన్న, మాజీ ఎంపిపి వాకటి మాధవి, మాజీ ఎంపిటిసిలు యాగంటయ్య ఆంజనేయులు, లక్ష్మన్న, నాయకులు మాదేష్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంఘీభావ పాదయాత్రలో గౌరుచరిత , తదితరులు

బంగారు చోరీ కేసు నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి, దేవనకొండ, పత్తికొండ మండలాలకు చెందిన వివిధ గ్రామాల్లో జరిగిన చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున మంగళవారం విలేకరులకు తెలిపారు. తుగ్గలి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన బోయ అగ్రహారం రంగస్వామి, వడ్డే నల్లన్న వారి నుండి సుమారు 78 గ్రాముల బంగారు, సుమారు 123 గ్రాములు వెండిని, రూ. 30 వేల నగదు ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. దేవనకొండ, తుగ్గలి, పత్తికొండ పోలీస్ స్టేషన్లో నమోదైన చోరీల కేసుల ప్రకారం విచారణ చేయగా పత్తికొండ సిఐ రామకృష్ణారెడ్డికి ముద్దాయిల సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి తుగ్గలి ఊరి బయట ఎద్దుల దొడ్డికి పోయేరస్తాలో తుగ్లలి చెరువు దగ్గర వారిని అదుపులోకి తీసుకొని బంగారును, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిని రిమాండ్ కు పంపినట్లు తెలిపారు.



పట్టుబడిన నిందితులతో ఎస్ఐ మల్లికార్జున



ఇంటర్ పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - హోళగుంద

ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందజేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం నాడు స్థానిక మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున అధ్యక్షతన ఎస్ఎఫ్ఐ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు మైన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా విద్యను నిర్వీర్యం చేస్తోందన్నారు. పాఠ్యపుస్తకాలు విద్యార్థులు సొంతంగా దుకాణాల్లో కొనుకోండి అని చెప్పడం సిగ్గు చేటు అన్నారు. ప్రభుత్వం గనక విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయక పోతే విద్యార్థులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడి చేస్తామన్నారు. అనంతరం కళాశాల ఎస్ఎఫ్ఐ కమిటీని ఎన్నుకున్నారు. కళాశాల అధ్యక్షులుగా హసేని, కార్యదర్శిగా రవి, సహాయ కార్యదర్శిగా అశోక్ ,ఉపాధ్యక్షులుగా అజేయ్‌లతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు అండగా ఉంటామని తెలియజేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో మోడల్ స్కూల్ ని కూడా ఏర్పాటు చేసేవిధంగా పోరాటాలు చేయడానికి ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు కళాశాల కమిటీ సభ్యులు గాదిలింగ,రామమూర్తి,నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు మంజూరయిన రోడ్డు వెయ్యరా ? : సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి

మండల పరిధిలోని తంగరడోన గ్రామానికి వెళ్లే రోడ్డుకు నిధులు మంజూరు అయిన రోడ్డు వేయడంలో ఆర్ అండ్ బి అధికారులు ఎందుకు పనులు ప్రారంభించడం లేదని సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు హనుమంతు ప్రశ్నించారు. మంగళవారం సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదోని రోడ్ నుండి తంగరడోన గ్రామానికి వెళ్లాలంటే 8 కి.మీ వరకు గుంతలపడి,వాహన దారులకు ప్రమాదకరంగా మారిందన్నారు. ఎంతో మంది కింద పడి ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామంలో 10 రోజులైనా మంచి నీరు రాకపోతే గ్రామ పంచాయతీ అధికారి, సర్పంచి ఏం చేస్తున్నారని మండిపడ్డారు. స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు ప్రతి నెల సక్రమంగా ఇవ్వాలన్నారు. ఎస్సీ, అర్బీటి కాలనీలో కరెంట్ పోల్స్,సిసి రోడ్లు,డ్రైనేజ్,మంచి నీరు సౌకర్యం కల్పించాలని కోరారు. గ్రామంలో చెడిపోయిన చేతి పంపులను మరమతులు చేపట్టాల న్నారు. అనంతరం వీఆర్వో రామాంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి చిన్న బాలు, మునెప్ప,తిమ్మప్ప, పెరుపులయ్య పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

అనారోగ్యంతో ఉప సర్పంచి మృతి

ప్రజాశక్తి-ఆలూరు

మండల పరిధిలోని పెద్దహోతూరు గ్రామ కురువ ఆనంద్ భార్య ఉపసర్పంచ్ వెంకటలక్ష్మి(45) మృతి చెందింది. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. గత కొంత కాలంగ అనారోగ్యంతో బాధపడుతున్న ఉపసర్పంచ్ వెంకటలక్ష్మి మంగళవారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గత నెలలో సర్పంచ్ లక్ష్మణ అనారోగ్యంతో మృతి చెందగా,ఇప్పుడు ఉపసర్పంచ్ వెంకటలక్ష్మి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



ఉపసర్పంచ్ వెంకటలక్ష్మి (ఫైల్ ఫోటో)

పార్టీలకతీతంగా కలిసి వస్తేనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి రౌండ్ టేబుల్‌లో వక్తలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పార్టీలకు అతీతంగా అందరూ కలిసి వస్తేనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధిపై మంగళవారం వీవర్స్ కాలనీ లోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో డివిజన్ ఇంచార్జ్ రంగయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రజాశక్తిజనరల్ మేనేజర్ నరసింహ, తెలుగుదేశం నాయకులు కదిరికోట ఆదెన్న, సిఐటియు డివిజన్ కార్యదర్శి రాముడు, సిపిఐ పట్టణ అధ్యక్షులు రంగన్న, మాజీ వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ అల్తాఫ్, ఉప్పర సంఘం మాజీ రాష్ట్ర డైరెక్టర్ ఆంజనేయులు ఏపీడబ్ల్యూజేఎఫ్ తాలూకా అధ్యక్షులు ... షబ్బీర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుదేశం జిల్లా నాయకులు కదిరి కోట ఆదెన్న

పరిశ్రమల ఏర్పాటులో పాలకులు విఫలం

ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ

నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఎమ్మిగనూరు పట్టణంలో చేనేత వృత్తి రాను రాను నిర్వీర్యం అవుతోంది. చేనేత సంక్షేమానికి ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు. పాలక, ప్రతిపక్షాలు ఆలోచించాలి. టెక్స్‌టైల్ పార్క్, లెదర్ పరిశ్రమలు వంటి వాటిని ఏర్పాటు చేయడంలో పాలకులకు చిత్తశుద్ధి లేదు. నియోజకవర్గంలో నానాటికి సాగు శాతం తగ్గుతోంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా పండించే ఉల్లి, మిర్చి, పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు ప్రయత్నం చేయాలి. పట్టణ జనాభా బాగా పెరిగినందున దానికి తగ్గట్టుగా తాగునీరు అందించే ప్రయత్నం చేయడం లేదు. రెండవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, గాజులదిన్నె ప్రాజెక్టు నుండి పైప్ లైన్ ద్వారా తాగునీరు అందించే ప్రక్రియ ఎక్కడ వేసిన గొం గళి అక్కడే అన్న చందంగా ఉంది.



మాట్లాడుతున్న నరసింహ

మిగతా వక్తలు మాట్లాడుతూ ఓ వైపు నియోజకవర్గానికి ఆనుకొని తుంగభద్ర నది పారుతున్న సాగునీరు లేక రైతాంగం అల్లాడిపోతున్నారన్నారు. గత సంవత్సరం 585 టీఎంసీల నీరు వృధాగా పారిపోయాయని, ఒక టీఎంసీ నీటిని సైతం నియోజకవర్గంలోని జిల్లా కాని వినియోగించుకోలేదన్నారు. నియోజకవర్గం నకు జీవ నాడి అయిన ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం, ఎల్ఎల్సి ఆధునీకరణ, గ్రౌండ్ ఫైప్ లైన్, గుండ్రేవుల ప్రాజెక్టుల పనులను ప్రారం భించేలా పార్టీలకతీతంగా జగన్ సర్కారుపై ఒత్తిడి తీసుకురావాలని రౌండ్ టేబుల్‌లో నేతలు విజ్ఞప్తి చేశారు.

బనవాసి దగ్గర ఉన్న ఫారెస్ట్ భూముల్లో అగ్రికల్చర్, ఇంజనీరింగ్ కళాశాలలను నిర్మించాలని అన్నారు. పట్టణానికి రింగ్ రోడ్డుతో పాటు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రెండవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నిర్మించాలని వక్తలు కోరారు.

పట్టణంలో సోమప్ప సర్కిల్ చుట్టూ.. మెరుపు తీగల లైట్లు వేయడం కాదు.. శివారు ప్రాంతాలలో, మురికివాడలలో రోడ్లు, డ్రైనేజీలు, నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, ఫ్లోరైడ్ గ్రామాలను గుర్తించి మంచినీటి సౌకర్యం ను అందించాలని తెలిపారు. నందవరం మండలంలో ఉన్న ఎర్రచందనం పరిశ్రమ అన్యంలోని వాడుక లోకి తీసుకురావాలని వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సర్క్యులేషన్ ఇంచార్జ్ ఎస్ ఏడి బాషా, నందవరం తెలుగుదేశం నాయకులు, ఎల్ఎల్సి మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు శేఖర్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, సూక్ష్మ కళాకారులు బారికి చంద్రశేఖర్, నియోజకవర్గ విలేకరులు దేవేంద్ర మూర్తి, దండు కాజా, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష : వైసిపి

ప్రజాశక్తి - చిప్పగిరి

సమస్యలు ఉన్నవారికి మీ పరిధిలో ఉన్న గ్రామ సచివాలయంలో వెంటనే పరిష్కరించుకో వడానికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో ఉపయోగపడ తుందని మండల ప్రజలకు వైసిపి మండల కన్వీనర్ ఏరూరు రంగస్వామి, అసెంబ్లీ బూత్ కన్వీనర్ రాజన్న తెలిపారు. మంగళవారం ఏరూరు గ్రామ సచివాలయంలో సర్పంచి వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సుధీర్ ఆధ్వర్యంలో తాసిల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో కొండయ్య సమక్షంలో కార్యక్రమం నిర్వహి ంచారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వారికి సంబంధిత సర్టిఫికెట్లను వెంటనే మంజూ రు చేయించి అందజేశారు. కన్వీనర్ మాట్లాడుతూ గ్రామ వాలంటీర్లు అందరూ కూడా ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. డిప్యూటీ తాసిల్దార్ గుండాల నాయక్ వైస్ ఎంపీపీ సుజాత ఏపీఎం నాగార్జున వీఆర్వో పెద్దన్న సర్పంచ్ భర్త సేనాపతి, బాలకృష్ణ, వెంకటేశు సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహశీల్దార్

ఏరూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఆయన మాట్లా డుతూ మండలంలో మొత్తం 29 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. గ్రామాలలో అదనంగా 1500 ఓటర్లు పెరిగిన పక్షంలో మరో పోలింగ్ బూత్ ఏర్పాటు చేసుకోవడానికి ఆస్కారం ఉంటు ందన్నారు. డిటి గుండాల నాయక్ పాల్గొన్నారు.



ఆస్పరి : ధృవీకరణ పత్రాలు అందిస్తున్న దృశ్యం

ఆస్పరి : ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని సొసైటీ చైర్మన్ గోవర్ధన అన్నారు. మండల పరిధిలోని చిన్నహోతూరు గ్రామంలో సర్పంచి గూళ్యం హరికృష్ణ అధ్యక్షతన జగనన్న సురక్ష నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కేడీసీసీ డైరెక్టర్ రాఘవేంద్ర, మండల కన్వీనర్ పెద్దయ్య,మాజీ మండల కన్వీనర్ రామాంజనేయులు, జెసిఎస్ కన్వీనర్ బసవరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనం తరం లబ్ధిదారులకు వారు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ మౌనిక,వైకాపా మండల కో కన్వీనర్ పురుషోత్తం రెడ్డి,మండల నాయకులు తిమ్మప్ప, ప్రకాష్,తాసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టా త్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్షతో ఉచి తంగా ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు మండల తాసిల్దార్ వెంకటేష్ నాయక్, మండల జడ్పిటిసి కిట్టు అన్నారు. మండల కేంద్రమైన దేవనకొండ సచివాలయం-2లో ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందించడమే లక్ష్యం అన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను వారు పంపిణీ చేశారు.



చిప్పగిరి: ధృవీకరణ పత్రాలు అందిస్తున్న నేతలు

ఉర్దూ పాఠశాలను డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి - కోసిగి రూరల్

మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలను జిల్లా విద్యాధికారి రంగారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఇఒ గత కొన్ని రోజుల క్రితం పాఠశాల ఉపాధ్యాయురాలపై దాడి చేసిన వ్యక్తి గురించి భోజన నిర్వాహకుల తో విచారణ చేసి ఆ విషయం గురించి ఆరా తీశారు. ఈ విష యంపై ఎంఈఓ మొహిద్దీన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉర్దూ పాఠశాలకు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నట్లు గుర్తించినట్లు డిఇఒ తెలిపారు. ఉర్దూ పాఠశాలకు ఉపాధ్యాయులు రావడానికి మక్కువ చూపడం లేదన్నారు. ప్రస్తుతం ఈ విద్యార్థులను సమీపంలో ఉండే పాఠశాలలో కూర్చోబెట్టి వారికి చదువు బోధించే విధంగా చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు. మండలంలోని పాఠశాలలో ఏకోపాధ్యాయులు ఉన్నచోట ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేస్తామ న్నారు. ఏడి సామెల్ పాల్, ఎంఈఓ నాగేశప్ప, తదితరులు పాల్గొన్నారు.



ఉర్దూ పాఠశాలను తనిఖీ చేస్తున్న డిఇఒ

భూమిపుత్ర ద్వారా మెరుగైన సేవలు : సర్పంచి

ప్రజాశక్తి - చిప్పగిరి

భూమిపుత్ర రైతు ఉత్పత్తి దారుల యాజమాన్య సభ్యుల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని, రైతుల ఎదరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి గోవిందరాజులు తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నాడు మండల కేంద్రమైన చిప్పగిరి బస్టాండ్ సమీపంలో భూమిపుత్ర రైతు ఉత్పత్తిదారుల కంపెనీ కార్యాలయమును కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించామన్నారు. మంత్రి సహకారంతో మండలంలోని తదితర గ్రామాలలో సీఈవో స్వర్ణలత ఆధ్వర్యంలో కంపెనీ సభ్యులు అందరూ రైతులకు కావలసిన సూచనలు అందిస్తారన్నారు. నాబార్డు వారి సహకారం సిఎస్ఎస్ పథకంలో భాగంగా ఎఫర్ట్ సంస్థ ద్వారా ఈ కంపెనీ నడుస్తుందన్నారు. రైతులందరూ చిప్పగిరిలోని భూమి పుత్ర కార్యాలయమునకు వచ్చి అనేక సందేహాలను పరిష్కరిం చుకోవచ్చు అన్నారు. కోఆర్డినేటర్ భానోదయ కంపెనీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కోసిగి రూరల్

మండలంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్క రించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బి.రాజు,నాయకులు యల్లప్ప లు మంగళ వారం కోసిగికి విచ్చేసిన డీఈఓ వి.రంగారెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి లకు డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రాజు మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం పదోన్నతుల్లో భాగంగా ఎస్జిటి ఉపాధ్యాయుల నుండి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా ప్రమోషన్లు వెళ్లిపోవడంతో మండలంలో అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని, ఆ అటువంటి పాఠశాలలకు తక్షణమే ఉపాధ్యాయులను కేటాయించి, విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. మండలంలో ఇండోర్ స్టేడియాన్ని నిర్మించాలని, కస్తూర్బా గాంధీ పాఠశాలలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ప్రతి విద్యార్థికి సీటు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ధర్నా

ప్రజాశక్తి -పెద్దకడబూరు

గ్రామ సమస్యలను పరిష్క రించాలని మండల పరిధిలోని కల్లుకుంట గ్రామ సచివాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న గౌడ్, ఉప్పర శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామ సమస్యల గురించి వివరించాడు. గ్రామంలో ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి వేయాలని, బస్టాండ్ ఆవరణంలో సిసి రోడ్డు, జగనన్న కాలనీలో పేదలకు గ్రామపక్కన స్థలాలు ఇవ్వాలి, హౌసింగ్ పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని కొత్త ఇండ్లు వెంటనే మంజూరు చేయాలని కోరారు. బీసీ ఎస్సీ ఎస్టీ తదితర కాలనీలలో సిసి రోడ్లు డ్రైనేజీలు వేయాలని, నవలేఖల్ ఎస్ఎస్ ట్యాంక్ ఫిల్టర్ బెల్ట్‌ను క్లీన్ చేయాలని, రైతులకు సబ్సిడీ విత్తనాలు సబ్సిడీ మందులు ఇవ్వాలని, అర్హులైన పేదలకు వృద్ధులకు వికలాంగులకు పింఛన్లు మంజూరు చేయాలని, తదితర డిమాండ్లతో డిజిటల్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు.



వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

పవన్ కళ్యాణ్‌పై కేసు నమోదు చేయాలి

పోలీస్ స్టేషన్లలో గ్రామ, వార్డు వాలంటీర్లు ఫిర్యాదు - కొనసాగుతున్న నిరసనలు

ప్రజాశక్తి: ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరులో గ్రామ, వార్డు వాలంటీర్లు మున్సిపల్ ఆఫీసు నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి పవన్ కళ్యాణ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐ మధుసూదన్ రావుకి వినతి పత్రం ఇచ్చారు. పవన్ బహిరంగంగా వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో చైతన్య, దేవదాస్,లోకేనాథ్షబ్బీర్, రత్నాకర్, శశి, ఈరన్న, ప్రతాప్, కుమార్, తేజ్, గఫూర్, ప్రభాకర్, సురేష్ పాల్గొన్నారు. **పెద్దకడబూరు :** జనసేన అధినేత పవన్‌పై కేసు నమోదు చేయాలని పెద్దకడబూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీనివాసులకు గ్రామ, వార్డు వాలం టీర్లు ఫిర్యాదు చేశారు. వాలంటీర్లు మహేంద్ర బాబు, మైమున్, బాలరాజు, గురుస్వామి పాల్గొన్నారు. **దేవనకొండ :** జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గ్రామ, వార్డు వాలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసన చేపట్టారు. మండల కేంద్రమైన దేవనకొండ గ్రామ సచివాలయం ముందు ప్రధాన రహదారిపై మండల జడ్పిటిసి సభ్యుడు కిట్టు ఆధ్వర్యంలో వాలంటీర్లు పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఒక మహిళ పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను ఆవేశంతో చెప్పుతో కొట్టాడు. ఈ సందర్భంగా జడ్పిటిసి కిట్టు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారదులుగా ఉంటూ ధృకృథంతో పనిచేస్తున్న వాలంటరీ వ్యవస్థపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేస్తున్న అనుచిత వాక్యాలు మానుకోకపోతే తగు మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మద్దికేర అంజి, తువ్వ దొడ్డి రాకేష్ రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.



దేవనకొండ : పవన్ దిష్టిబొమ్మను చెప్పుతో కొట్టుతున్న మహిళ

మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్న పవన్

చిప్పగిరి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మతిస్థిమితం కోల్పోయి అడ్డదిడ్డంగా మాట్లాడు తున్నాడని ఎంపీపీ జూటూరు హేమలత మారయ్య అన్నారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభు త్వం అందించే అనేక సంక్షేమ పథకాలకు గ్రామ వాలంటీర్లు వారిధిగా ఉంటూ ప్రతి ఒక్క లబ్ధిదారులకు చేరుటకు వాళ్ల కృషి మరువలేనిదని అన్నారు. కరోనా సమయంలో ప్రతి ఒక్కరు భయపడుతున్న గ్రామ, వార్డు వాలంటీర్లు ప్రాణాలను పణంగా పెట్టి ఇంటింటికి తిరిగి సర్వేలు నిర్వహించారన్నారు. మహిళా వాలంటీర్లను పవన్ నీచంగా సంబోధిం చడం సిగ్గుచేటు అన్నారు. పవన్ కళ్యాణ్ తన స్థాయిని దిగజార్చుకుంటున్నాడని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధనుంజయ, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ హేమలత



మాట్లాడుతున్న కోరమండల్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ జి.వి. సుబ్బారెడ్డి

సేంద్రీయ ఎరువులతోనే అధిక దిగుబడి

- కోరమండల్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ జివి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి సాధ్యమని, రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులతో మంచి వ్యవసాయం చేయాలని కోరమండల్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ జి.వి.సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం ఏపీ ఆదర్శ పాఠశాల కోసిగిలో ప్రిన్సిపల్ సమీరా రెడ్డి అధ్యక్షతన, డిఇఒ రంగారెడ్డి ఆధ్వర్యంలో కోరమండల్ సంస్థ తరఫున ఏర్పాటు చేసిన ప్రయోగశాల, ఆర్వో ప్లాంట్లను మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏ కంపెనీ అయితే లాభదాయకంగా ఉంటుందో కంపెనీలో కొంత భాగం సేవా రూపంలో ఇలాంటి కార్యక్రమాలు చేస్తామన్నారు. దాదాపు 15 లక్షల రూపాయలతో ఆర్వో ప్లాంట్, వృక్ష శాస్త్రం జంతుశాస్త్రం, భౌతిక, రసాయనిక శాస్త్రాలకు సంబంధించిన అన్ని పరికరాలు, ప్రయోగశాలలను కోరమాండల్ సంస్థ తరఫున ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు మంచి నడవడికతో బాగా చదివి క్రమశిక్షణతో పెరిగి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడి శామ్యూల్ పాల్, కోసిగి సర్పంచ్ అయ్యమ్మ, ఎంపీపీ ఈరన్న, మార్కెట్ యార్డ్ చైర్మెన్ మఠం శరణమ్మ, సింగిల్ విండో అధ్యక్షులు మఠం మహంతేష్ స్వామి, నాడిగేని నర్సింహులు, నాడిగేని నాగరాజు, మణిక్యా రాజు, బెట్టనగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పిటిసి మంగమ్మ, వైసిపి నాయకులు మఠం జగదీష్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి-ఆలూరు

మండల పరిధిలోని అరికేర, హెూలేబీడు, అంగస్కాల్, మానేకుర్తి, ఏ. గోనెహల్, కమ్మరచేడు,గ్రామ పరిధిలో ఉన్న స్థానిక సమస్యలను పరిష్క రించాలని మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆయా గ్రామ సచివాల యాల కార్యదర్శులకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం సినియర్ నాయకులు కేపీ నారాయణ స్వామి, సిపిఎం మండల కార్యదర్శి షాకీర్ మాట్లాడుతూ జగనన్న ఇంటికి ప్రతి లబ్ధిదారులకు 5లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని, జింకల పార్క్‌ను ఏర్పాటు చేసి రైతులను కాపాడాలని, పంట నష్టపోయిన రైతులందరికి ఇన్సూరెన్స్ డబ్బులు వెంటనే ఇవ్వాలి, పెంచిన విద్యుత్ ఛార్జిలను తగ్గించాలి, తాగునిటి సమస్య ను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు పరమేష్, లక్ష్మీకాంత్, గాదిలింగప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

త్రీ మెన్ కమిటీ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని సివి రామన్, దీక్ష జూనియర్ కాలేజ్‌ల్లో త్రీమెన్ కమిటీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. మంగళవారం పట్టణంలోని సివి రామన్ , దీక్ష జూనియర్ కళాశాలకు ఆర్ఐఓ గురువయ్య శెట్టి నేతృత్వంలోని త్రీమెన్ కమిటీ బృందం కళాశాల గదులను, ల్యాబ్ లను పరిశీలించారు. సివి రామన్ కళాశాలలో ల్యాబ్ సౌకర్యాలను పెంచుకోవాలని, ప్రభుత్వాన్ని షిఫ్టింగ్ పర్మిషన్‌కు రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. కళాశాలలో ఏవైనా సౌకర్యాలు కొరత ఉంటే 90 రోజుల గడువు ఇస్తామని అంత లోపల సరిచూసుకో వాలని ఆయన తెలిపారు. త్రీ మెన్ కమిటీ నివేదికను ప్రభుత్వానికి పంపుతామని అన్నారు. దీక్ష కళాశాలలో విద్యార్థులకు సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

యువగళం 2 వేలు కిమీ పూర్తిపై

టిడిపి శ్రేణులు సంఘీభావ పాదయాత్ర

ప్రజాశక్తి - ఆదోని

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 2 వేల కిలోమీటర్లు పూర్తి చేసుకొన్న సందర్భంగా ఆదోని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ శాసనసభ్యులు కె మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, కర్నూలు జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ శ్రేణులు సంఘీభావ పాదయాత్ర చేపట్టారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి అక్కడ నుండి తిమ్మారెడ్డి బస్టాండ్ వరకు కొనసాగిన ఈ పాదయాత్రలో పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు, బాబు జగ్జీవన్ రావ్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించడం ద్వారా లోకేష్ ప్రజా సమస్యలు తెలియజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగస్వామి నాయుడు, రామస్వామి, సత్తన్న, మండల అధ్యక్షుడు బసవరాజు, బుద్ధారెడ్డి, అరెకల్ రామకష్ణ, శేష్ రెడ్డి, జయరాం, వెంకటేష్, లక్ష్మీనారాయణ, రవి, శ్రీనివాస్ ఆచారి, ఐసి రామకష్ణ, సజ్జత్ హుస్సేన్, లోక్‌నాథ్ రెడ్డి, మల్లికార్జున, గోవిందప్ప, అన్వర్ భాష, అల్తాఫ్, కిష్టప్ప, రామంజి, సోము, నాగరాజు, రాజు, బాలస్వామి, ప్రహ్లాద్ రెడ్డి, హర్ష, విరుపాక్షి రెడ్డి ఉన్నారు.

ఆలూరు: ఆలూరులో టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ కోట్లసుజాతమ్మ ఆదేశాల మేరకు నాయకులు,కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుండి పాదయాత్రగా ప్రధాన రహదారి గుండా సంత మార్కెట్ లోని సుంకులమ్మ అమ్మవారి గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కొరకు ప్రజాసమస్యలు తెలుసుకుంటూ రాష్ట్ర భవిష్యత్తుకు కార్యాచరణ రూపొందిం చుకొంటు 2వేల కి.మీ. యువగళం పాదయాత్ర పూర్తి చేసుకున్న నార లోకేష్ బాబు 4వేల కి.మీ. పూర్తి చేసుకొని దిగ్విజయంగా రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా టిడిపి ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి నరసప్ప, జిల్లా వాల్మీకి సాధికార కమిటి సభ్యులు భాస్కర్, జిల్లా టిఎన్టియుసి అధికార ప్రతినిధి నాగరాజు,మండల కార్యదర్శి అరికేర రాముడు,జిల్లా పార్లమెంట్ ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి ఈరన్న,జిల్లా ఎస్సి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కొమ్ము రామంజి,జిల్లా తెలుగుయువత అధికార ప్రతినిధి సురేంద్ర,పట్టణ అధ్యక్షుడు శేఖర్,తాలూకా తెలుగుయువత నాయకులు సోమశేకర్ నాయుడు,బిసి. సంఘం కార్యదర్శి రాజశేఖర్, మండల కార్యదర్శి లక్ష్మీపతి, ఎంపిటిసి చిన్న యాదవ్,యూత్ లీడర్ రాము,కమ్మరచేడు కుమార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **దేవనకొండ** : టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. స్థానిక టిడిపి కార్యాలయం నుండి ప్రధాన రహదారులు మీదుగా ర్యాలీగా క్రాస్ రోడ్డు వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్ గౌడ్, నాయకులు ఉచ్చిరప్ప, మాలిక్ బాష, ఆకుల వీరేష్ మాట్లాడుతూ ప్రజల బాధలు తెలుసుకోవడానికి నారా లోకేష్ పాదయాత్ర చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లయ్య, మల్లికార్జున్ గౌడ్, డీలర్ బండ్లయ్య, సర్పంచులు భాస్కర్, చిన్న రామప్ప, హనుమంతు, వెంకటస్వామి గౌడ్, నాగేశ్వరరావు, నాగేష్, చిన్న రాముడు, తిమ్మప్ప, గిడ్డయ్య గౌడ్, రాజశేఖర్ గౌడ్,లతీఫ్, రాజగోపాల్ గౌడ్, తెలుగు యువత నాయకులు రాజా సాహెబ్,కాశీం, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పెద్దయ్య, బాలరంగుడు, ఐ టీడీపీ నాయకులు రామాంజనేయులు, చాంద్ బాషా,తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుండి రామతీర్థం క్షేత్రం వరకు టిడిపి నేతలు పాదయాత్ర చేపట్టారు. ముందుగా చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బాణసంచా పేల్చి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ పరమా రెడ్డి, మండల కార్యదర్శి శేషాద్రి నాయుడు మాట్లాడుతూ యువగళం జనగళంగా మారి ప్రకంపనలు సృష్టిస్తోందన్నారు. టిడిపి మినీ మేనిఫేస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ కన్వీనర్లు శ్రీనివాసులు గౌడ్, ఎస్.తిమ్మన్న,సొసైటీ మాజీ చైర్మన్ నౌనేపాటి చౌదరి,మాజీ సర్పంచ్ వరదరాజులు, ముత్యాల రెడ్డి,సర్పంచ్ అంజినయ్య, ఎంపీటీసీ నరసన్న,నాయకులు రాజ్ కుమార్,సతీష్, రామచంద్రారెడ్డి, నాగేంద్ర,రఘు,వీరేష్ పాల్గొన్నారు.



ఆదోని : మాట్లాడుతున్న టిడిపి నాయకులు



ఆలూరులో పాదయాత్రలో పాల్గొన్న నాయకులు,కార్యకర్తలు



దేవనకొండ : పాదయాత్రలో పాల్గొన్న టిడిపి నేతలు



ఆస్పరి : మాట్లాడుతున్న నాయకులు



డిఆర్ఒకు వినతిపత్రం అందజేసి సమస్యలు వివరిస్తున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

కదంతొక్కిన అంగన్‌వాడీలు

- కలెక్టరేట్ నుండి నూనెపల్లె బ్రిడ్జి వరకు ర్యాలీ, రాస్తారోకో
- ఐసిడిఎస్‌కు నిర్వీర్యానికి మోడీ కుట్ర
- సమస్యలను విస్మరిస్తే బాబుకు పట్టిన గతే జగన్‌కూ పడుతుంది
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి
- మహాధర్నాకు ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన 36 గంటల మహాధర్నాలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీలు కదం తొక్కారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు భారీగా కలెక్టరేట్ నుండి నూనెపల్లి బ్రిడ్జి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శోభా రాణి అధ్యక్షత వహించారు. అంగన్వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం డిఆర్ఒ వినతిపత్రం స్వీకరించారు. వారం రోజుల్లో జాయింట్ మీటింగ్ వేసి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వేతనాలు, ఇతర అంశాలను రాష్ట్ర ప్రభుత్వానికి వెంటనే తెలియజేస్తామని భరోసా ఇచ్చారు. దీంతో అంగన్వాడీలు రాస్తారోకోను విరమించారు.

అంతకుముందు జరిగిన ధర్నాలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ ఐసిడిఎస్‌కు బడ్జెట్ తగ్గించి నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో కోత విధించడం వలన దేశంలో ఉన్న లక్షలాదిమంది పేద మహిళలు, గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. మోడీ కార్పొరేట్ సంస్థలకు ప్రజాధనాన్ని అప్పనంగా దోచి పెడుతున్నారని అన్నారు. బిజెపి పాలనలో అంబానీ, అదానీలకు తప్ప మరెవ్వరికీ లాభం చేకూరలేదని తెలిపారు. నేటికీ దేశంలో 50 శాతం పైగా మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని చెప్పారు. 60 శాతం మంది పిల్లలు పౌష్టికాహార లోపంతోనే పుడుతున్నారని పేర్కొన్నారు. ఈ దేశానికి ఆరోగ్యకరమైన భవిష్యత్ తరాలకు అందించే పని కేంద్ర ప్రభుత్వం చేయడం లేదని, ఇది అత్యంత ప్రమాదకరమైనదని అన్నారు. 48 ఏళ్లగా కనీస వేతనాలకు నోచుకోకుండా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పని చేస్తున్నారని తెలిపారు. ప్రమాద బీమా, వేతనంతో కూడిన మెడికల్ లీవ్, పెన్షన్, గ్రాట్యుటీ వంటి సౌకర్యాలు నేటికీ లేకపోవడం సిగ్గు చేటన్నారు. బేటీ బచావో బేటి పడావో నినాదం ఒట్టి మాటలేనని, పసి పిల్లల జీవితాలతో మోడీ ఆటలాడుతున్నారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు, 45, 46 ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సభల తీర్మానం మేరకు ఐసిడిఎస్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో 26 లక్షల మంది అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు 10 కోట్ల మంది లబ్ధిదారులకు సేవలు అందిస్తున్నారని, వీరి ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతని, దాన్ని విస్మరిస్తే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా పెంచుతానని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాలు దాటుతున్నా నేటికీ వేతనాలు పెంచకపోవడం దుర్మార్గమని అన్నారు. ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లులు, రిటైర్డు వారికి అందిస్తున్న 50 వేల రూపాయలు సంవత్సరాల తరబడి పెండింగ్ ఉన్నాయని చెప్పారు. అంగన్వాడీలపై దాడులు పెరిగాయని, సెంటర్ల విజిట్ పేరుతో మానసికంగా వేధిస్తున్నారని, ఇది సరైనది కాదన్నారు. పౌర సరఫరా శాఖ కమిషనర్ రాష్ట్రంలో అక్రమంగా దాచిపెడుతున్న ధాన్యాలను మార్కెట్లో ప్రజా పంపిణీకి తీసుకొచ్చేలా ప్రయత్నం చేయాలని, మరోవైపు రాష్ట్రంలో నకిలీ, నాణ్యతలేని సరుకులు అమ్మకాలు జరుగుతూ కోట్ల రూపాయలలో లాభాలు దండుకుంటున్నారని, అంగన్వాడీ సెంటర్లకు ప్రభుత్వ పెద్దలే నాసిరకపు సరుకులు పంపిణీ చేస్తున్నారని, వాటి సంగతి తేల్చకపోగా అంగన్వాడీలను వేధించడం సమంజసం కాదన్నారు. వేసవి సెలవులలో కూడా అనేక రకాల పనులు అప్పగించి చేయించారని, పేరుకే సెలవులు తప్ప అంగన్వాడీలకు ఒరిగిందేమీ లేదన్నారు. సర్వీస్‌ని బట్టి గ్రాడ్యూటీ ఇవ్వాలని చెప్పినప్పటికీ నేటికి రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. 98 శాతం ఇచ్చిన హామీలను నెరవేర్చామని చెప్తున్న జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. అంగన్వాడీ వర్కర్లకి, హెల్పర్లకి వెంటనే వేతనాలు పెంచాలని, బకాయిలు చెల్లించాలని, మినీ వర్కర్లని మెయిన్ వర్కర్లుగా పరిగణించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మహాధర్నాకు మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు ఈ.నిర్మల, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.రమేష్ కుమార్, యువజన సంఘాల నాయకులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు రామరాజు తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి ఏసురత్నం, ఏ నాగరాజు, జిల్లా నాయకులు తోట మద్దులు, కే మహమ్మద్ గౌస్, భాస్కర్ రెడ్డి, లక్ష్మణ్, బాల వెంకట్, వెంకట లింగం, శివరాం, రత్నమయ్య, భాస్కర్, జిల్లా నలుమూలల నుండి అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు, సెక్టార్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మహాధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.రమేష్ కుమార్



నూనెపల్లె బ్రిడ్జి సెంటర్‌లో రాస్తారోకో చేపడుతున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు

జనాభా నియంత్రణ తక్షణ కర్తవ్యం

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి డాక్టర్ ఆర్.వెంకట రమణ
- ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రతి కుటుంబ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, జనాభా నియంత్రణ అందరి ముఖ్య కర్తవ్యమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి డాక్టర్ ఆర్.వెంకట రమణ అన్నారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డిఎంహెచ్ఒ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుండి వైస్సార్ విగ్రహం వరకు నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి అందరిచే ప్రతిష్ట చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ ప్రగతి, అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక స్వావలంభణ లక్ష్యాల సాధన, కుటుంబ నియంత్రణ పద్దతులను పాటించడం, దేశ జనాభాను అరికట్టడం మనందరి బాధ్యత, సంకల్పమని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు జనాభా పెరిగిపోతుందని, తద్వారా తలెత్తే దుష్పరిణామాలను వివరించేందుకు, సమస్యలపై అవగాహన కలిగించేందుకు ప్రతి సంవత్సరం జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం డిఐఒ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, ఎస్‌కెడిసి డా.కాంతారావు, ఎఫ్‌పిసి నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ చంద్రా రెడ్డి, పరిపాలన అధికారి డాక్టర్ చంద్రశేఖర్, ప్రసన్న లక్ష్మి, డిపిఎం డాక్టర్ ప్రేమంత్, ఎంఎల్‌పిహెచ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ కాలేజీల విద్యార్థులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ

ఇళ్ల పట్టాలు అమ్మడం నేరం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - చాగలమర్రి

ప్రభుత్వం పేదల కోసం ఇచ్చిన ఇళ్ళ పట్టాలను అమ్ముకుంటే చట్టరీత్యా నేరమని నంద్యాల ఆర్‌డిఒ శ్రీనివాస్ తెలిపారు. మంగళ వారం చాగలమర్రి తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులు ఇళ్ళు నిర్మించుకోవాలని, అమ్మవద్దని సూచించారు. జిల్లాలో భూ రీ సర్వేలో చాగలమర్రి మండలం ప్రథమ స్థానంలో ఉందన్నారు. 11 గ్రామాల్లో రీసర్వే పూర్తైందన్నారు. ఆగస్టు నాటికి 48 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాల్సి ఉందన్నారు. రైతులు పొలాలలోకి వెళ్ళడానికి రస్తా లేదని అడ్డగిస్తే దిగువ ఉన్న రైతులు తమకు ఫిర్యాదు చేస్తే ఈజిమెంట్ యాక్ట్ ద్వారా రస్తా వెళ్లేందుకు అనుమతులు కల్పిస్తామని తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా ఇప్పటి వరకు 2790 సర్టిఫికెట్లను పంపిణీ చేశామన్నారు. 90 రోజుల క్రితం చాగలమర్రి మండలంలో 130 మంది అర్హులు ఇళ్ళ స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారికి త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో తహసీల్దారు సుభద్రమ్మ, డిటి విజయ్ కుమార్, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులతో చర్చిస్తున్న ఆర్‌డిఒ



మాట్లాడుతున్న ఎంపిపి రేగటి రాజశేఖర్ రెడ్డి

జగనన్న సురక్షలో 11 రకాల సర్వీసులు

- ఎంపిపి రేగటి రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - డోన్ : జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సర్వీసులు ప్రజలకు ఉచితంగా అందిస్తున్నామని డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం డోన్ మండలం దొరపల్లె గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు డోన్ వైస్ ఎంపీపీ సుభద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డోన్ ఎంపీపీ కమలాపురం రేగటి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, డోన్ జెడ్పీటీసీ రాజ్ కుమార్, డోన్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామచంద్రుడులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న సురక్ష ప్రోగ్రామ్ 15004 గ్రామ, వార్డు సచివాలయాల్లో నెలరోజులపాటు కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో 90 శాతానికిపైగా అర్హులందరికీ పథకాలు అందుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. సాంకేతిక, మరే ఇతర కారణాల వల్లో ఆ ఒక్క శాతం మంది కూడా మిగిలిపోకూడదన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అర్హులకు పథకాలు మంజూరు చేస్తారని, వివిధ సర్టిఫికెట్లు జారీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో తాహసిల్దార్ విద్యాసాగర్, డిప్యూటీ తాహసిల్దార్ మధు, ఈవోఆర్డి వరప్రసాద్ రావు, సీనియర్ అసిస్టెంట్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం నాయకుడికి సన్మానం

ప్రజాశక్తి-డోన్ : జాతీయ బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులను బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలను స్వచ్ఛందంగా అందిస్తూ విగ్రహావిష్కరణలకు పాటుపడుతున్న వ్యక్తి నక్కల మిట్ట శ్రీనివాసులు అని కొనియాడారు. అనంతరం బిసి సంక్షేమ సంఘం నంద్యాల డివిజన్ మహిళా అధ్యక్షురాలుగా వనం లక్ష్మీదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



దండాల సిఐని సస్పెండ్ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - డోన్

డోన్ పట్టణ పోలీస్ స్టేషన్ ఉన్నతాధికారి రక్షకభటుల కార్యాలయాన్ని సెటిల్మెంట్ల అడ్డాగా మార్చి, అసాంఘిక శక్తులకు కొమ్ముకాస్తూ దందాలకు పాల్పడుతున్న సిఐని తక్షణమే సస్పెండ్ చేసి, అక్రమంగా సంపాదించిన ఆస్తులపై ఏసీబీ అధికారులతో సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు శ్రీకాంత్, కే.నాగరాజులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. సిఐ కార్యాలయంలో ప్రత్యేక గదిని ఏర్పాటు చేసుకుని నిత్యం పట్టణంలోని గంజాయి, మట్కా, అక్రమ మద్యం, చైన్ స్టేటస్, సెటిల్మెంట్ చేసుకుంటూ లక్షల రూపాయలు వారి నుంచి తీసుకుంటూ అమాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. మహిళల పట్ల సిఐ వ్యంగంగా, అసభ్యకరంగా మాట్లాడుతూ చిత్ర హింసలకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేదల సమస్యలపై వెళ్లిన ఉద్యమ నాయకులకు కనీస మర్యాద కూడా అక్కడ లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర రెడ్డి, పోలీసు జిల్లా అధికారులు స్పందించి సిఐని తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో రేపటి నుంచే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చిన్న రహిమాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఉరేసుకుని ఉపాధ్యాయురాలు ఆత్మహత్య

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

కోవెలకుంట్ల పట్టణంలోని పద్మావతి నగర్‌లో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సౌభాగ్యమ్మ (55) మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఆకుమల్ల మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా సౌభాగ్యమ్మ పని చేస్తున్నారు. ఉపాధ్యాయురాలు సౌభాగ్య, ఆమె భర్త సుధాకర్ రెడ్డితో కలిసి కోవెలకుంట్లలోని పద్మావతి నగర్‌లో ఎస్ఆర్‌బిసి డిఈ భాస్కర్ బాబు ఇంట్లో అద్దెకు నివాసం ఉంటున్నారు. గత కొంతకాలం క్రితం వారి కుమారుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆమె తీవ్ర మనస్థాపంతో, మానసిక వేదనకు గురైన మంగళవారం తెల్లవారుజామున ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలిసిన ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.



ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఉపాధ్యాయురాలు

సిసి రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాల పట్టణ శివారు ప్రాంతమైన నందమూరి నగర్‌లో జెండా మాను ఎదురుగా, శివాలయం వెనుక భాగాన ఉన్న రహదారులలో మెటల్స్ తోలి సిసి రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ డిమాండ్ చేశారు. సిపిఐ నందమూరి నగర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ మాబున్నిసాకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నందమూరి నగర్ సిపిఐ శాఖ కార్యదర్శి ఎస్ హుస్సేన్నా, కాలనీవాసులు నాయక్, ఆదినారాయణ, బాసు, కరీముల్లా పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** సుండిపెంట గ్రామపంచాయతీ పరిధిలోని భగత్ సింగ్ కాలనీలో సిసి రోడ్లు వేయాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం అధికారులను కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. భగత్ సింగ్ కాలనీలో స్మశానం పక్కన దాదాపు 100 కుటుంబాల వారు గత 20 ఏళ్లుగా నివాసముంటున్నారు. రోడ్డు వేయాలని కాలనీ ప్రజలు గడపగడప కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లారన్నారు. సోమవారం ఆత్మకూర్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశామన్నారు. ఎంపిడిఒ స్పందించి కచ్చితంగా సిసి రోడ్లు ఏర్పాటు చేస్తామని, ఇప్పటికే కొన్ని కాలనీలో రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారన్నారు.

'జగనన్న గోరుముద్ద' మెస్ ఛార్జీలు పెంచాలి

ప్రజాశక్తి - బనగానపల్లె : జగనన్న గోరుముద్దకు మెస్ ఛార్జీలు పెంచాలని ఏఐటీయూసి మండల కార్యదర్శి కుల్లాయిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఏఐటియుసి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న గోరుముద్ద పథకం విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచకపోవడం వల్ల నిత్యవసర వస్తువుల పెరుగుదలతో కార్మికులకు మధ్యాహ్న భోజనం వండడం పెనుభారంగా మారిందన్నారు. మహిళా కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతూ పథకాన్ని కొనసాగిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలు పెంపుదల చేసి, కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, వెంకటలక్ష్మి, మద్దయ్య, కేశాలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మకు బోనాలు సమర్పణ

ప్రజాశక్తి - ప్యాపిలి : వర్షాలు కురవాలని కోరుతూ ప్యాపిలిలో పెద్దమ్మ అమ్మవారికి మహిళలు బోనాల పండుగ మంగళవారం నిర్వహించారు. పెద్దమ్మకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుండి ఉపాధి పనులపై తనిఖీ : ఎపిఒ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్ : ఉపాధి హామీ పథకంలో చేసిన పనులను, వాటి వివరాలను నేటి నుండి తనిఖీ చేసేందుకు జిల్లా రిసోర్స్ పర్సన్స్, మండల రిసోర్స్ పర్సన్స్ గ్రామాలకు వెళ్లనున్నట్లు ఎపిఒ వసుధ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేసిన ఉపాధి హామీ పనులను తనిఖీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏవో హనీఫ్ ఖాన్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళాలు

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైల క్షేత్రంలోని అన్నదాన పథకానికి మంగళవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. విరాళాలు అందజేసిన వారిలో న్యూ సౌత్ వాలిస్ ఆస్ట్రేలియాకు చెందిన డాక్టర్ ఆకాష్ తడిమల్ల రూ.1,01,101, హైదరాబాద్‌కు చెందిన దుగ్గిరాల అనంత రామ శర్మ రూ.1,01,000, శ్రీ హేమవాణి రూ.1,01,000, విరాళంగా దేవస్థానం పర్యవేక్షకులకు అందజేశారు. విరాళాలు అందజేసిన వీరికి శేష వస్త్రాలను, ప్రసాదాలను, సంబంధించిన రశీదులను అందజేసినట్లుగా ఆలయ అధికారులు తెలిపారు.

పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి : గ్రామాల్లో ప్రజలందరూ పరిశుభ్రత పాటించి డెంగ్యూను తరిమికొట్టాలని వైద్యాధికారి వినోద్ కుమార్, దీపా నాగవేణి తెలిపారు. మంగళవారం కొత్తపల్లిలోని ప్రభుత్వ వైద్యశాలలో డెంగ్యూ నివారణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైద్యశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. సిహెచ్ఒ బాలకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : గాజులపల్లెలోని సుంకులమ్మ దేవాలయం నిర్మాణానికి ప్రముఖ వైద్య దంపతులు భార్గవ వర్ధన్ రెడ్డి, ఆర్.మల్లేశ్వరిలు రూ.20 వేలు విరాళంగా మంగళవారం అందజేశారు.



చెత్తాచెదారంతో నిండిపోయిన డ్రైనేజీ కాల్వలను శుభ్రం చేయిస్తున్న అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

- డ్రైనేజీల్లో చెత్తాచెదారం తొలగింపు

ప్రజాశక్తి - మహానంది

'పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మహానంది మండలం బొల్లవరం గ్రామంలో గాంధీ సెంటర్‌కు వెళ్లే రహదారిలో చెత్తాచెదారంతో నిండిపోయిన డ్రైనేజీ కాలువలను అధికారులు మంగళవారం శుభ్రం చేయించారు. దీంతో గ్రామ ప్రజలు ప్రజాశక్తి దినపత్రికకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజాగళం యాత్రగా 'యువగళం' : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

యువగళం పాదయాత్ర ప్రజాగళం యాత్రగా మారిందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు, ఒంగోలు పార్లమెంట్ కోఆర్డినేటర్ బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 2 వేల కిలోమీటర్లకు చేరుకున్న సందర్భంగా కావలి నియోజక వర్గంలోని శ్రీపురం విడిది కేంద్రం నుండి ప్రారంభమైన యువగళం పాదయాత్రలో నారాలోకేష్‌కు సంఘీభావంగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. 2 వేల కిలోమీటర్ల పైలాన్ ప్రారంభించి, యువగళం పాదయాత్రలో లోకేష్‌తో అడుగులో అడుగు వేస్తూ ముందుకు సాగిన బిసి జనార్దన్ రెడ్డి సందర్భంగా మాట్లాడారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రజల ఆశీర్వాదంతో అన్ని అడ్డంకులను అధిగమిస్తూ విజయవంతంగా 2 వేల కిలోమీటర్ల మైలురాయిని చేరుకుందని తెలిపారు. అధికార పార్టీ నారా లోకేష్ పాదయాత్రను అడ్డుకోవాలని ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల ఆశీస్సులతో ముందుకు సాగుతోందని తెలిపారు.



నారా లోకేష్ వెంట పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి


ట్రాక్టర్‌తో విత్తనాలు వేస్తున్న దృశ్యం

జోరుగా ఖరీఫ్ విత్తన సాగు

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలో భారీ వర్షం కురవడంతో ఖరీఫ్ విత్తన సాగు జోరందుకుంది. రైతన్నలు బిజీ బిజీగా పొలాల్లో విత్తనాలు వేయడంలో నిమగ్నమయ్యారు. గత వారంలో కురిసిన భారీ వర్షాల కారణంగా రైతులు మొక్కజొన్న, పత్తి, వరి విత్తనాలు నాటుతున్నారు. గతంలో వర్షాలు పడిన వెంటనే గ్రామాల్లో ఉన్న రైతులు కాడెద్దులతో సేద్యం చేస్తూ విత్తనాలు మనుషులతో వేయించడంతోపాటు కూలీలకు పనులు దొరికేవి. ప్రస్తుతం ఎక్కువ శాతం రైతులు తొందరగా విత్తనాలు వేయాలని ట్రాక్టర్ల ద్వారా వేయిస్తుండడంతో కూలీలకు పనులు దొరకడం లేదు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పలు రకాల విత్తనాలను వేసిన రైతులు పచ్చగా ఉన్న పొలాలను చూసి సంతోష పడుతున్నారు. ఏదేమైనప్పటికీ కొత్తపల్లి మండలంలో జోరుగా విత్తన సాగు జరుగుతోంది.

ప్రమాదకరంగా మలుపులు

- ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలతో కనిపించని రహదారి

ప్రజాశక్తి - మహానంది

మండల పరిధిలోని నంద్యాల-గిద్దలూరు జాతీయ రహదారిపై ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మల వల్ల మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు సరిగ్గా కనబడకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. మూల మలుపు వద్ద ఏపుగా పెరిగిన చెట్లు రోడ్డును చుట్టేశాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ఈ ప్రదేశంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అనేక మంది ప్రమాదాల బారిన పడి గాయాలపాలయ్యారు. కొత్త వారు మరింత జాగ్రత్త తీసుకోకపోతే ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తే ప్రమాదం బారిన పడాల్సిందే. ఈ రహదారుల్లో రోజూ పలువురు ప్రముఖులు ప్రయాణం చేస్తుంటారు. ఈ రోడ్ల మీదుగా నిత్యం ప్రజా ప్రతినిధులు, అధికారులు ఏదో ఒక పనిపై ప్రయాణం చేస్తూనే ఉంటారు. అయినా వారికి రోడ్డును చుట్టేసిన చెట్లు, ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు కనిపించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాకాలంలో రోడ్లకు ఇరువైపుల ఏపుగా పెరిగిన చెట్లను తొలగించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న మలుపు దారి

మంచి సేవలతోనే గుర్తింపు : ఎస్ఐ

ప్రజాశక్తి - బేతంచర్ల

ప్రస్తుత సమాజంలో ప్రతి ఉద్యోగికి మంచి సేవలతోనే గుర్తింపు వస్తుందని బేతంచెర్ల ఎస్సై శివ శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తు ఇటీవల బదిలీపై వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ బాలాజీ సింగ్, చంద్రశేఖర్, కానిస్టేబుల్ గాండ్ల నాగరాజు, మహిళా పోలీసులు షాహినా, లక్ష్మితో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లను ఏఎస్ఐ లింగమయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన పోలీస్ సిబ్బంది సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ గురు బాబు, తిరుపాల్ నాయక్, ఎంవి రమణ,, నాగరాజు, మహిళా పోలీస్ సిబ్బంది లక్ష్మి పాల్గొన్నారు.

కలిసికట్టుగా పని చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

అందరం కలిసికట్టుగా పనిచేసి చాగలమర్రి పురోగతికి పాటుపడుదామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కోరారు. మంగళవారం చాగలమర్రిలోని 17వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు రాష్ట్ర ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, 16 వార్డు సభ్యులు వలిసా గారి షరీఫ్ (పెయింటర్), మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షులు వీరభద్రుడు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో వచ్చిన పలు సమస్యలను 4, 5 సచివాలయంలో నంద్యాల ఆర్‌డిఒ, ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాస్, జిల్లా డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ భాస్కర్ నాయుడు, జిల్లా హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారి మాధవరావులతో సమీక్షా సమావేశాన్ని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ తులసమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 250 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు ఇవ్వాల్సి ఉందని,వాటి కోసం స్థలాలను కొనుగోలు చేసేందుకు అధికారులు అంచనాలు తయారు చేయాలని కోరారు. ఎక్కువ మందికి వివిధ రకాల పెన్షన్లు రావడంలేదని వాటిని పరిష్కరించి మంజూరయ్యేలా చూడాలన్నారు. వైయస్సార్ కళ్యాణమస్తు, విధివిధానాలను డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి వివరించారు. ఆర్డిఓ శ్రీనివాసులు మాట్లాడుతూ చాగలమర్రిలో గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన ఫిర్యాదులన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరయ్యేలా చూస్తామన్నారు. అనంతరం 90 రోజుల లో ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో మహమ్మద్ దౌలా, మండల విస్తరణాధికారి సుదర్శన్ రావు మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మహమ్మద్ సుహేల్, మండల ఉపాధ్యక్షులు మొహమ్మద్ రఫీ, డిప్యూటీ తాసిల్దార్ విజయ్ కుమార్, ప్రభుత్వ వైద్యాధికారి, ఇమ్రాన్, ఏఈలు కొండారెడ్డి,జక్కయ్య, షాజహాన్ వ్యవసాయ అధికారి రంగా నేతాజీ, వైసిపి నాయకులు గణేష్ రెడ్డి రమణ, మండల కో ఆప్షన్ సభ్యులు జిగ్గి గారి ఇబ్రహీం, ఆర్ఎస్ రమణ, ఖాదర్ బాషా, చక్రం బీడీ ముల్లా షబ్బీర్, గోవిందయ్య, ఐడియా బాబు, మెడికల్ స్టోర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

'అమ్మ ఒడి'పై వీడని ఆందోళన

- 80 శాతమే నగదు పడినట్లు గణాంకాలు
- అర్హత ఉందని చూపిస్తున్నా తప్పని ఎదురుచూపులు
- బ్యాంకుల చుట్టూ తల్లిదండ్రుల ప్రదక్షిణాలు

ప్రజాశక్తి - చాగలమర్రి

అమ్మఒడి పథకానికి అర్హత ఉన్నా ఈసారి ఎక్కువ మందికి రాలేదని చాగలమర్రి మండలంలో చర్చ సాగుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు గత పది రోజులుగా బ్యాంకు ఖాతాలను చూసుకుంటూనే ఉన్నారు. ఏరోజుకారోజు ఫోన్లో తనిఖీ చేసుకుంటున్నారు. బ్యాలెన్స్ చూశాక నిరుత్సాహపడుతున్నారు. ఖాతాల్లో జమ కానీ లబ్ధిదారులందరికీ ఇదే పరిస్థితి. అధికారులు చెప్పే గణాంకాలకు జమలకు పొంతన ఉండడం లేదు. సచివాలయ సిబ్బందినో లేక వాలంటీర్‌నో కనుక్కుంటే ఈ నెల 10లోపు పడతాయని చెబుతున్నారు. పదో తేదీ కూడా ముగిసింది. వాస్తవంగా ఎంతమందికి డబ్బులు పడ్డాయి..? ఎంత మందికి పడలేదని సమాచారం కూడా మండల యంత్రాంగం వద్ద లేదు. విద్యాశాఖ అధికారులు మాత్రం మండలంలో 80 శాతం మంది లబ్ధిదారులకు నగదు జమ చేసినట్లు చెబుతున్నారు. వివిధ కారణాల వల్ల 20 శాతం మందికి పడలేదని స్పష్టం చేస్తున్నారు. కారణాలు అంటే ఏమిటి అనేది స్పష్టత లేదు. గతేడాది అదే విద్యార్థి తల్లి ఖాతాలో నగదు పడింది. ఈ ఏడాది వేయకపోవడానికి కారణం ఏమిటనేది తెలియడం లేదు. ఏదో రకంగా కోతలు పెట్టారు. అధికారులు చెప్పిన గణాంకాల మేరకు 20 శాతం మంది అర్హులకు అందలేదు. వాస్తవానికి ఈ లెక్క ఇంకా ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమయంలో పుస్తకాలు, ఫీజులకు ఉపయోగపడతాయని ఎదురుచూసిన తల్లులకు నిరాశే మిగిలింది.

ఘనంగా ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - డోన్

డోన్ పట్టణంలోని ఆర్‌టిసి డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ 72వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను యూనియన్ డిపో సెక్రటరీ ఐవిఆర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు ఎంప్లాయ్ యూనియన్ సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏ.గోపాల్, కే.మేఘవర్నుడు, డిపో ప్రెసిడెంట్ పి.మౌలాలి, ఏకే.రావు, టీఎస్.రావు, ఎంఎస్.నారాయణ, యు.కామేష్, ఎడీసీలు చంద్ర, రంగస్వామి, ఎస్‌ఎం.భాష,గారేజ్ సెక్రటరీ వెంకటదాసు, నాగేంద్ర, ఐసీస్.రెడ్డి, సేకరప్ప, ఇమామ్ సాహెబ్, రాముడు, ఎస్ఏ.జాకీర్, యు.రంగస్వామి, ఎం.కిష్టన్న, కే.వెంకటేశ్వర్లు, ఉమాకాంత్, నవీన్, ప్రవీణ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

శ్రీశైలం రిజర్వాయర్‌లో 120 టిఎంసిలు చోరీ

- రాయలసీమ సాగునీటి సాధన సమితి

ప్రజాశక్తి - నంద్యాల

శ్రీశైలం రిజర్వాయరులో చట్ట ప్రకారం ఉండాల్సిన నీటి నుండి సుమారు 120 టిఎంసిల నీరు దొంగతనం జరిగిందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి తెలిపారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్వర్యంలో మంగళవారం శ్రీశైలం రిజర్వాయర్లో నీటి దొంగతనంపై జిల్లా ఎస్‌పి రఘువీరారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కృష్ణా, తుంగభద్ర నదుల ద్వారా సుమారు 2017 టిఎంసిలలో నీరు గత నీటి సంవత్సరం జూన్ 1, 2022 నుండి మే 31, 2023 వరకు శ్రీశైలం రిజర్వాయర్‌కు చేరిందన్నారు. నీటి కేటాయింపులకు అదనంగా శ్రీశైలం రిజర్వాయర్‌కు నీరు చేరిన సందర్భంలో కనీస నీటిమట్టం 854 అడుగుల పైన 60 టిఎంసిల క్యారీ ఓవర్ రిజర్వుగా నీరు నిలువ ఉంచాలని చట్టం ఉందన్న విషయాన్ని వివరించారు. రాబోయే నీటి సంవత్సరంలో వర్షాలు ఆలస్యమైనా, నీరు తక్కువగా వచ్చినా తాగు నీటి అవసరాలకు ఇబ్బంది లేకుండా, వ్యవసాయ పనులకు అవాంతరాలు కలుగకుండా ఉండటానికి ఈ చట్టం చేశారని తెలిపారు. ఈ చట్టం ప్రకారం మే 31, 2023 నాటికి శ్రీశైలం రిజర్వాయర్లో సుమారు 150 టిఎంసిల నీరు నిలువ ఉండాలని, కానీ ఈ ఏడాది మే 31 నాటికి 34 టిఎంసిల నీరు ఉందన్నారు. రిజర్వాయర్‌లో ఈ స్థాయిలో నీరు ఉంటే రాయలసీమ నీటిని పొందడానికి అవకాశం ఉండదని చెప్పారు. రాష్ట్ర పోలీసు శాఖ నీటి దొంగలను కనిపెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు ఏరువ రామచంద్రారెడ్డి, వై.యన్.రెడ్డి, వెంకటేశ్వరనాయుడు, భాస్కర్ రెడ్డి, సుధాకర్ రావు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు బస్సుయాత్ర : టిడిపి

ప్రజాశక్తి - నందికొట్కూరు

ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు టిడిపి ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపడుతున్నామని ఆ పార్టీ నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు మాండ్ర శివానందరెడ్డి అన్నారు. భవిష్యత్తుకు గ్యారంటీ నినాదంతో ప్రజల్లో చైతన్య అవగాహన కల్పించడానికి తెలుగుదేశం పార్టీ చైతన్య బస్సు యాత్రను మంగళవారం నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామం నుంచి టిడిపి అధిష్టాన ఆదేశాల మేరకు ప్రారంభించారు. బస్సు యాత్ర నందికొట్కూరు పట్టణం మీదుగా అంబేద్కర్ సర్కిల్ చేరుకుంది. టిడిపి నేతలు మాండ్ర శివానందరెడ్డి, గౌరు చరిత రెడ్డి, గిత్త జయ సూర్య ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమ రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టో పట్ల ప్రజలు హర్షకేతాలు తెలుపుతున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో నాలుగేళ్ల పాలనలో ప్రజలకు కష్టాలు తప్ప మరి ఏమి సాధించేది లేదని వారు విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కాకరవాడ చిన్న వెంకటస్వామి, ఖాతా రమేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, పల్లె రఘునాథ్ రెడ్డి, షకీల్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ ముర్తుజావలి, గిరీశ్వర్ రెడ్డి, మహేష్ నాయుడు, వెంకటేశ్వర్లు యాదవ్, లాయర్ జాకీర్ హుస్సేన్, కళాఖర్, నిమ్మకాయల రాజు, బొల్లెద్దుల రాజన్న, రగడ, ప్రభు కుమార్, బ్రహ్మయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు జయాకర్, లాడెన్, మాజీ సర్పంచ్ కలీముల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.


పాములపాడులో మాట్లాడుతున్న నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, పాల్గొన్న మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్

పాములపాడు : ఒక్క ఛాన్స్‌తో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసారనిటిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, డోన్ ఇన్చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, రాష్ట్ర మైనార్టీ టీడీపీ సెల్ అధ్యక్షులు మౌలానా, నందికొట్కూరు పరిశీలకులు మురళి, ఇన్చార్జి జయసూర్యలు అన్నారు. టిడిపి నాయకులు చేపట్టిన బస్సు యాత్ర సాయంత్రం పాములపాడుకు చేరుకుంది. ప్రధాన సెంటర్లో జరిగిన మీటింగ్లో నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ఇసుక, మైనింగ్, లిక్కర్ దందా కొనసాగుతుందన్నారు. స్థానికంగా ఇస్కాలలో ఎత్తిపోతల పథకం రూ.20 కోట్లతో ప్రారంభిస్తే నేటికీ లోకల్ లీడర్ల కమీషన్ కోసం పనులు నిలిపివేశారన్నారు. నాడు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని 18 నెలల్లో పూర్తి చేశామని, జైన్ ఇరిగేషన్, సోలార్ వంటి ప్రాజెక్టులు చంద్రబాబు హాయంలోనే జరిగిందన్నారు. చంద్రబాబే రాష్ట్రానికి భవిష్యత్తు అని, టిడిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు హరినాద్ రెడ్డి, నాయకులు రవీంద్రనాథ్ రెడ్డి, తిమ్మారెడ్డి, వెంకటేశ్వర రావు, చంద్రశేఖర్, గోవిందు, మధు కృష్ణ, శివ శంకర్ స్వామి, స్వాములు, బాల మల్లేశ్వర్ రెడ్డి, రాము చౌదరి, అబ్దుల్ ఆఫీస్, నాయకులు పాల్గొన్నారు.

13, 14న గడప గడపకు కార్యక్రమం

- వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల



మండలంలో ఈ నెల 13, 14న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివి రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 13వ తేది గురువారం ఎర్రగుడిగ్రామం, హనుమంతు గుండం గ్రామం, 14వ తేదీ ఉదయం నాగిశెట్టి పల్లి, బి.ఉప్పలూర్, బి.తాడిపత్రి గ్రామాల్లో గడప గడప కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

పక్కా గృహాల నిర్మాణానికి రూ.397 కోట్లు ఖర్చు : హౌసింగ్ పిడి

ప్రజాశక్తి - చాగలమర్రి

నంద్యాల జిల్లాలో జగనన్న లే అవుట్లలో,లబ్ధిదారులు సొంత స్థలాల్లో ఇంటి నిర్మాణాల కోసం రూ.397 కోట్లు ఖర్చు చేశామని హౌసింగ్ పిడి భాస్కర్ నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో జిల్లాలో 43,550 గృహాలు మంజూరయ్యాయని, జగనన్న లే అవుట్లలో 23,581, సొంత స్థలాల్లో 20,974 గృహాలు మంజూరు చేశామన్నారు. ఇప్పటి వరకు 18 వేల గృహాలు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశలో ఉన్నాయన్నారు. 12,300 మంది లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి శ్రీధర్‌రెడ్డి, ఆర్‌డిఓ శ్రీనివాస్, హౌసింగ్ ఈఈ మాధవరావు, డిఈ నాగరాజు, తహసీల్దారు సుభద్రమ్మ, డిటి విజయ్ కుమార్, హౌసింగ్ ఏఈ షఫివుల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే గుణపాఠం తప్పదు : పిడిఎస్‌యు

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదనిపిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎస్ఎండి.రఫీ హెచ్చరించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో పట్టణ జనరల్ బాడీ సమావేశం పట్టణ కార్యదర్శి నవీన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయనమ ఆట్లాడుతూ నాలుగు గోడల మధ్య చదువుతో పాటు, విద్యా రంగంలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ఎయిడెడ్, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, పాఠశాలలు, టీచర్ పోస్టులను కుదించే 84, 85, 117 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువుందనే పేరుతో ఎయిడెడ్ పాఠశాలల మూసివేతను విరామించుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనంతరం పిడిఎస్‌యు పట్టణ కమిటీ అధ్యక్షులుగా షైక్, షాహిద్, ప్రధాన కార్యదర్శిగా వినోద్, ఉపాధ్యక్షులుగా నవీన్, నాని, సహాయ కార్యదర్శులుగా గిరి, శంకర్, కోశాధికారి అనిల్‌తోపాటు మరో ఆరు మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

సర్పంచుల నిధులు దోచుకున్న సిఎం : అఖిలప్రియ



రుద్రవరం : మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - రుద్రవరం

రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సర్పంచుల నిధులు దోచుకున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆరోపించారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 2 వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘీభావంగా మంగళవారం టిడిపి పరిశీలకుడు వెంకట శివుడు యాదవ్, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ మండలంలోని టి.లింగందిన్నె గ్రామంలో పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గడపగడపకు వెళ్లి సమస్యలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి లక్ష్మీదేవి, టిడిపి నాయకులు లింగం వెంకట రంగ నాయకులు, చిన్నికృష్ణ, ఎర్రం ప్రతాప్ రెడ్డి, బండారు బాలరాజు, లక్ష్మీకాంత్ యాదవ్, శ్రీనివాసులు, పత్తి బాచెపల్లె నారాయణ, బలరాం రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. **నంద్యాల కలెక్టరేట్ :** నారా లోకేష్ పాదయాత్ర 2 వేల కిలోమీటర్లు మైలురాయిని చేరుకున్న సందర్భంగా నంద్యాల నియోజకవర్గంలో మద్దతుగా మాజీమంత్రి ఎన్ఎండి ఫరూక్, నియోజకవర్గ ఇంచార్జ్ భూమా బ్రహ్మానంద రెడ్డి నంద్యాల పట్టణంలో పాదయాత్రగా బయలుదేరి ఎన్టీఆర్ కాంప్లెక్స్ దగ్గరకు చేరుకుని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ, నంద్యాల మండలం, గోస్పాడు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్యాపిలి :** నారా లోకేష్ యువగళం పాదయాత్ర 2 వేల కిలోమీటర్లు చేరుకున్న సందర్భంగా సంఘీభావంగా టిడిపి డోన్ నియోజకవర్గ అభ్యర్థి ధర్మారం సుబ్బారెడ్డి మండలంలోని రాచర్ల గ్రామం నుంచి కంబగిరి స్వామి దేవాలయం వరకు 6 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, రాఘవేంద్ర, గౌతమ్ కుమార్ రెడ్డి, రామసుబ్బయ్య, వెంకటేశ్వరరెడ్డి, చిన్న సుంకయ్య, రాంమోహన్, మల్లికార్జున, సత్యం,విష్ణు, మౌలాలి రెడ్డి, గోపాల్ రెడ్డి, అనుదీప్, రామచంద్రుడు, బాలరంగన్న పాల్గొన్నారు.


నంద్యాలలో పాయదత్ర చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే భూమా


ప్యాపిలి : పాదయాత్ర చేపడుతున్న ధర్మారం సుబ్బారెడ్డి

బ్రహ్మానందచారికి ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానందచారికి హైదరాబాదులో తెలంగాణ సార్వస్థితిక భవనంలో మనం ఫౌండేషన్ 6వ వార్షికోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డు అందజేశారు. ప్రముఖ సినిమా నటుడు రాజేంద్ర, హీరో సంపత్ రెడ్డి, జబర్దస్త్ అదిరే అభి, సినీ నిర్మాత ఎం.మార్ చౌదరి, మనం ఫౌండేషన్ అధ్యక్షుడు లాయర్ చక్రవర్తి, సెక్రటరీ అభిరామ తదితరులు బ్రహ్మానంద చారిని ఘనంగా సన్మానించి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మానందచారి మాట్లాడుతూ జేకేఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 950 సేవా కార్యక్రమాలు పూర్తి చేశామని, వీటిని గుర్తించి మనం ఫౌండేషన్ వారు అవార్డుని ఇచ్చినట్లు తెలిపారు. ఈ అవార్డు స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - మిడుతూరు

మండలంలోని అన్ని గ్రామాలలో రీ సర్వేను వేగవంతం చేయాలని ఆర్‌డిఒ ఎం.దాస్ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో మండల, విలేజ్ సర్వేయర్లు, విఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో రీ సర్వే వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ ప్రకాష్ బాబు, డిప్యూటీ తహశీల్దార్ షానవాజ్ మహమ్మద్ హుస్సేన్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను వినియోగించుకోండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూరు

జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కురుకుంద గ్రామంలో, ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ కాలనీలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు 99 శాతం అమలు చేశారన్నారు. నేడు జగనన్న సురక్ష పథకం ద్వారా 11 ఉచిత సేవలను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో స్థానిక మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాసరావుపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు వార్డులకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి పట్టుమని 40 మంది ప్రజలు హాజరు కాకపోవడం పట్ల వాలంటీర్లపై కమిషనర్‌కు సరైన పట్టు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమనుకుంటే సెలవులు పెట్టి వెళ్లాలని, ఇలా కార్యక్రమాలను నిర్వహించడం తగదని, సంబంధిత వాలంటీర్లను తొలగించేందుకు వెనకాడొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త శిల్ప భువనేశ్వర్ రెడ్డి, ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా, జడ్పిటిసి శంకర్ రెడ్డి, ఎంపిపి నల్లకాల తిరుపాలమ్మ, విజయ చౌదరి, మారుబోతుల విజయ్, పాణ్యం పార్వతి, బోయ పార్వతి, సుల్తాన్, వైసిపి పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, మండల అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఒక వరం లాంటిదని సర్పంచ్ కురువ మహేశ్వరి తెలిపారు. ముత్తులూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు కుల, ఆదాయ, జనన , మరణ తదితర సర్టిఫికెట్లను ఆమె పంపిణీ చేశారు. తహసిల్దార్ రవీందర్ ప్రసాద్, ఎంపీడీవో మధు సూదన్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎఈ వెంకట్రాముడు, ఆర్డబ్ల్యూసీ ప్రమోద్, ఉపాధి ఏపీవో ప్రతాప్, పంచాయతీ కార్యదర్శి పాములేటి, వీఆర్వోలు పుల్లయ్య, హుస్సేన్, ఉప సర్పంచ్ రామనాథరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **గడివేముల :** మండలంలోని చిందుకూరు గ్రామ సచివాలయం ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం మాజీ సర్పంచి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పిటిసి ఆర్బి చంద్రశేఖర్ రెడ్డి, మండల అధ్యక్షురాలు నాగమద్దమ్మ, ఎంపిడిఒ శివమల్లేశ్వరప్ప, వైసిపి బొల్లవరం నాయకులు భూపాల్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, వైసిపి నాయకులు తిరుపంరెడ్డి పాల్గొన్నారు. **సంజామల :** మండలంలోని కమలాపూర్ గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహసిల్దార్ మల్లికార్జునరావు, ఎంపీడీవో నాగ కుమార్ పాల్గొని 11 రకాల సర్టిఫికెట్లు, ఉచిత సేవలపై వివరించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **మహానంది :** గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కారం కోసం జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మండలంలోని అబ్బీపురం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వైసిపి శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, జడ్పిటిసి మహేశ్వర్ రెడ్డి, తహసిల్దార్ జనార్దన్ శెట్టి, ఎంపీడీవో శివ నాగజ్యోతి పాల్గొన్నారు. **బేతంచెర్ల :** మండలంలోని కొలుములపల్లి, ముద్దవరం గ్రామాలలో సర్పంచులు చిన్న మద్దమ్మ, తిమ్మయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ నాగభూషణ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఉర్దూ అకాడమీ రాష్ట్ర నాయకులు ముర్తుజావలి, కుమార్ రెడ్డి బాబుల్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్, ఎద్దులన్న, వెంకటేశ్వర్లు, రామానాయుడు, కృష్ణుడు, మద్దయ్య, మండల అధికారులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** కొత్తపల్లిలో సర్పంచు లక్ష్మీదేవి, ఎంపీడీవో మేరీ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు ఆర్డీవో దాసు, జడ్పిటిసి సోముల సుధాకర్ రెడ్డిలు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వైసిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి, నాగ ఎల్లయ్య, పరశురాముడు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** మండలంలోని నల్లగట్ల గ్రామ సచివాలయములో జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపీడీవో మహబూబ్ ఖాన్ అధ్యక్షతన జరిగింది. ఆయా గ్రామాల సర్పంచుల చేతుల మీదుగా కుల, నివాస, ఆదాయ సర్టిఫికెట్లను అందజేశారు. **నందికొట్కూరు :** మండలంలోని దామగట్ల గ్రామంలో సర్పంచి మాధవరం సుశీలమ్మ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ పాల్గొన్నారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. నాయకులు మాధవరం యేసురత్నం, సంజన, అధికారులు పాల్గొన్నారు. **పాములపాడు :** మండలంలోని మిట్టకందాల గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఆర్డీవో దాస్, తాసిల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో గోపికృష్ణ నాయుడు, కోఆప్షన్ మెంబర్ ముర్తుజా అలీ, వైసీపీ నాయకులు చౌదయ్య, రమణారెడ్డి, మధుసూదన్ రావు, భీమశంకర్, రాములమ్మ, రాజన్న పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని తుమ్మలపెంట సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ వై.పాపిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ ఎ.గుర్విరెడ్డి హాజరై మాట్లాడారు. సర్పంచి బెస్త మల్లేశ్వరి, తహశీల్దార్ ధోని అల్ఫ్రెడ్, ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణ రెడ్డి, నాయకులు తోట మల్లేశ్వర్ రెడ్డి, పెద్దిరెడ్డి వెంకటలక్ష్మి రెడ్డి, బాల దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహానంది : మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి


పాములపాడు : సర్టిపికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్


కొలిమిగుండ్ల : సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న జెడ్పి చైర్మన్


ఆళ్లగడ్డ : మాట్లాడుతున్న అధికారులు